# సాక్షి
## అనంతపురం

బుధవారం । 1 । జనవరి । 2025






**టన్ను చీనీ రూ.27,420**

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీ టన్ను గరిష్టంగా రూ.27,420 వేల ప్రకారం విక్రయాలు జరిగాయి.



**కిలో టమాట రూ.9**

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.9. కనిష్టంగా రూ.4. సరాసరిన రూ.6 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
**33.5°/14.5°**

జిల్లా అంతటా మంగళవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటలకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### సంతోషాలు వెల్లివిరియాలి

- ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు 'అనంత'



**అనంతపురం కార్పొరేషన్:** నూతన ఏడాదిలో ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్త ఏడాదిని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. 2025లో ప్రతి ఒక్కరికీ దైవానుగ్రహం సంపూర్ణంగా లభించాలని అభిలషించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించినప్పుడే మెరుగైన సమాజ స్థాపన సాధ్యమవుతుందని, ఆ దిశగా అందరూ ముందుకు నడవాలని కోరారు. నూతన సంవత్సరంలో శాంతి, శ్రేయస్సు, ఉల్లాసం, సంతోషాలు విలసిల్లాలన్నారు. ఉజ్వల భవిష్యత్తు, కొత్త అవకాశాలను అన్వేషించడానికి, నూతన లక్ష్యాలను సాధించడానికి కొత్త సంవత్సరం ప్రేరణనిస్తుందని తెలిపారు.

### 'నూతనో'త్సాహంతో సాగుదాం

**అనంతపురం అర్బన్:** జిల్లా ప్రజలు, ఉద్యోగులకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ప్రకటనలు విడుదల చేశారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగానూ, వృత్తిపరంగానూ లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి, పట్టుదలతో వాటిని సాధించేందుకు నూతనోత్సాహంతో ముందుకు వెళ్లాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవించాలన్నారు. ప్రతి కుటుంబంలో ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రశాంతంగా జీవించాలని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా వెంటే ఉంటామని తెలిపారు.

### కలెక్టరేట్‌లో 2న వేడుకలు



**అనంతపురం అర్బన్:** కలెక్టరేట్‌లో ఈనెల 2వ తేదీన కొత్త సంవత్సర వేడుకలను నిర్వహించాలని నిర్ణయించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప దినాలు జనవరి 1వ తేదీ వరకు ఉన్న నేపథ్యంలో 'నూతన' వేడుకలను 2న జరుపుకోనున్నారు. కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు మార్పు చేసినట్లు డీఆర్‌ఓ ఎ.మలోల తెలిపారు. రెవెన్యూ భవన్‌లో అవసరమైన ఏర్పాట్లను కలెక్టరేట్ అధికార యంత్రాంగం చేయనుంది.

### అభ్యంతరాల స్వీకరణ గడువు పొడిగింపు

**అనంతపురం అర్బన్:** ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువు ఈనెల 7వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌ఓపీ విధివిధానాలు తెలియజేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. వివరాలను ఈనెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. అనంతరం తనిఖీలు పూర్తిచేసి తుది కులగణన సర్వే వివరాలను ఈనెల 17న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని చెప్పారు.

### సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

**అనంతపురం క్రైం:** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్.ఆదోని ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు, చెన్నై ప్రయాణికుల సౌకర్యార్థం జిల్లాలోని అన్ని డిపోల నుంచి అదనపు బస్సులు తిప్పాలని నిర్ణయించామన్నారు. జనవరి 9 నుంచి 12వ తేదీ వరకు మొత్తం 136 అదనపు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు తిరుగు ప్రయాణానికి కూడా 130 ప్రత్యేక బస్సులు తిప్పుతామన్నారు. మొత్తం 266 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయడం లేదన్నారు. సాధారణ చార్జీలతోనే ప్రయాణం చేయవచ్చన్నారు. బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించామని, ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చునని సూచించారు. రానుపోను ఒకేసారి బుక్ చేసుకున్న వారికి టికెట్ ధరలో 10 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు.

## న్యూ ఇయర్ జోష్..



హుషారుగా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఆనందం ఆకాశాన్నంటింది. ఉత్సాహం ఉరకలేసింది. డీజే శబ్దాలు మిన్నంటాయి. శుభాకాంక్షల వెల్లువ కురిసింది. ఎన్నో అనుభూతులను, అనుభవాలను పంచిన 2024 సంవత్సరం ఇక సెలవంటూ మాయమైపోగా.. 2025 ఏడాది మరింత కొత్తగా వచ్చేసింది. నూతన సంవత్సరానికి జిల్లా ప్రజలు ఘన స్వాగతం పలికారు. కోటి కోరికలతో సాదరంగా ఆహ్వానించారు. మంగళవారం సాయంత్రం నుంచే న్యూ ఇయర్ సంబరాలు మొదలయ్యాయి. సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలకు 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ మార్మోగించారు. సంబరాల్లో మునిగితేలారు. స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులకు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు ఆలయాలకు క్యూకట్టారు. మరోవైపు, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కాగా, కొత్త ఏడాదిని పురస్కరించుకుని మంగళవారం జిల్లాఅంతటా సందడి నెలకొంది. కొనుగోలుదారులతో దుస్తుల దుకాణాలు, బేకరీ షాపులు కిటకిటలాడాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలతో ఉర్రూతలూగించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



నూతన సంవత్సర వేడుక సందర్భంగా టవర్ క్లాక్ వద్ద యువత సందడి



అనంతపురంలో ఓ బేకరీ వద్ద మంగళవారం సాయంత్రం కొనుగోలుదారుల రద్దీ

# ఆశల ఏడాది.. శ్రమిద్దామా మరి!

- కొత్త ఏడాది.. కొన్ని నిర్ణయాలు
- కార్యాచరణ ఉంటేనే కెరీర్‌కు బాటలు
- కఠిన నిర్ణయాల అమలుతోనే జీవితంలో వెలుగులు




**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** నూతన సంవత్సరం.. కొత్త కొత్త ఆలోచనలు..అనుభూతులు.. ఈ ఏడాది ఏదో ఒకటి చేయాలనే తపన. ఏం చేద్దామనే ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి. 'ఈ రోజు నుంచి నేను మద్యం ముట్టను' అంటూ భీష్మ ప్రతిజ్ఞ చేసే వాళ్లు కొందరు.. 'నేను మాంసం అసలే తినను' అంటూ కరాఖండీగా చెప్పేవాళ్లు ఇంకొందరు.. 'ఏది ఏమైనా జూదం జోలికి వెళ్లను' అంటూ మరొకరు... ఇక.. 'ఈ ఏడాదైనా పెళ్లి భాగ్యం కలుగుతుందో? లేదో' అంటూ ముక్కోటి దేవుళ్లకు మొక్కే యువతీ యువకులు చాలా మందే ఉన్నారు. కొత్త ఏడాది కలిసొస్తుందేమోనన్న ఆశలతో ముందుకు సాగుతూ డిసెంబర్ 31కి వీడ్కోలు చెబుతుంటారు. అయితే, మరుసటి రోజు షరా మామూలే అన్నట్టుంటే విలువేముంటుందనేది డాలర్ల ప్రశ్న.

**కార్యాచరణ తప్పనిసరి..**

కొత్త ఏడాది కలలు కనడం, కోర్కెలు సాకారం చేసుకోవడం అటుంచితే అనుకున్న విషయాలను అమలు చేయడానికి కార్యాచరణ లేకే చాలామంది వెనుకబడుతున్నారు. కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పుడు అవి కష్టమైనా.. కార్యాచరణ ఉంటేనే సాకారమవుతాయనేది గుర్తుంచుకోవాలి. సమయ పాలన, ఓర్పు, నేర్పుతో ముందుకెళితేనే కొత్త ఏడాదికి అర్థముంటుంది.

**పోటీ తీవ్రత..**

కెరీర్‌లో స్థిరపడాలనుకునే యువత తమ కలలు సాకారం చేసుకోవాలంటే సమయం చాలా ముఖ్యం. కోర్కెలు కోరి దేవుడికి వదిలేస్తే తీరవనేది తెలిసిందే. ఒక్క ఏడాది వృథా అయితే వచ్చే ఏడాదిలో పోటీగా లక్ష మంది అదనంగా చేరతారు. దీన్నిబట్టి ఈరోజు నుంచే కెరీర్‌పై దృష్టి పెట్టి సమయాన్ని వృథా చేసుకోకుండా కాలంతో పరుగులు పెట్టాలి.

**అసలు సిసలు నిర్వచనం..**

పనులు వాయిదా వేస్తున్నప్పుడే ఒత్తిడి పెరుగుతుందనే విషయం గుర్తుంచుకోవాలి. ఈరోజు పాతం ఈరోజే.. ఈ రోజు పని ఈరోజే చేస్తే ఒత్తిడి ఉండదు. 'వాయిదా' అనే జాడ్యం మనిషిని నిలువెల్లా దహించి వేస్తుంది. దీనివల్ల ఒత్తిడి కొండలా పెరిగిపోతుంది. ఈ క్రమంలో వాయిదా పద్ధతులకు సత్వరమే స్వస్తి పలకాలని గట్టిగా నిర్ణయించుకోవాలి. ''కాల గమనంలో ఎన్నో సంవత్సరాలు వస్తూ పోతూ ఉండటం సహజం. కావాల్సిందల్లా కాలంతో పోటీపడగలిగే శక్తిని ప్రోది చేసుకోవడం.. దానికోసం సమయం వృథా చేసుకోకుండా నిత్యం శ్రమించడం..'' ఇదే కొత్త ఏడాదికి అసలు సిసలు నిర్వచనం.

### మితంగా మొబైల్ వాడకం



కాలాన్ని వృథా చేయడమంటే మనల్ని మనం పణంగా పెట్టడమే. మొబైల్ వచ్చిన తర్వాత 70 శాతం యువత కాలాన్ని మొబైల్‌తోనే వృథా చేసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల పేరుతో సగటున రోజుకు 4 గంటల సమయం వృథా అవుతున్నట్లు తేలింది. అంటే ఏడాదికి 60 రోజులు అయినట్లు లెక్క. కొత్త ఏడాది నుంచైనా యువత దీన్నుంచి బయటపడాలి.

### ఆరోగ్యానికి సమయం...



చిట్‌చాట్‌లు, మొబైల్ చాటింగ్‌లకు సమయం కేటాయిస్తారు కానీ.. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం లేదు. ఈ కారణంగానే 30 ఏళ్లకే యువతలో గుండెపోటు కేసులు నమోదవుతున్నాయి. కొత్త ఏడాదిలో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలంటే వ్యాయామం మొదలెట్టాలి. 'ఈరోజు నుంచే' అనే పట్టుదలతో ముందుకెళ్లాలి.

### స్వీట్ దుకాణాల్లో మోసం

- 14 కేసుల నమోదు



**పుట్టపర్తి అర్బన్:** ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు పట్టణాల్లో ఏర్పాటు చేసిన స్వీట్ దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతపురం, నార్పల, బత్తలపల్లి, ధర్మవరం, పుట్టపర్తిలో దాడులు నిర్వహించి తక్కువ తూకం (ఒక కేజీకి 200 గ్రాములు తక్కువ) ఉండటాన్ని గుర్తించారు. అనంతపురంలో 4, బత్తలపల్లిలో 2, ధర్మవరంలో 2 కేసులు నమోదు చేశారు. ప్యాకేజీ తినుబండారంపై తయారీ దారులు, పూర్తి చిరునామా, తయారీ నెల, సంవత్సరం, ఎంఆర్‌పీ, వినియోగదారుడు ఫిర్యాదు చేయడానికి ఉండాల్సిన పేరు చిరునామా, ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఐడీ తదితర వివరాలను ముద్రించకపోవడం, కూల్ డ్రింకులు అధిక ధరలకు అమ్ముతున్నందుకు 5 కేసులు మొత్తం 14 కేసులు నమోదు చేశారు. అందులో 7 కేసులకు రూ.38 వేల జరిమానా విధించారు. తనిఖీల్లో లీగల్ మెట్రాలజీ అధికారి మహమ్మద్ గౌస్, టెక్నికల్ అసిస్టెంట్ మహమ్మద్ పాల్గొన్నారు.

# ముగిసిన ఓటరు జాబితా సవరణ

**అనంతపురం అర్బన్:** ఓటరు జాబితా సవరణ–2025 ప్రక్రియ ముగిసింది. అక్టోబరు 29వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రకటించారు. ఆ రోజు నుంచి నవంబరు 28వ తేదీ వరకు నెల రోజుల పాటు ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా ఓటు నమోదు (ఫారం–6), ఓటు తొలగింపు (ఫారం–7), ఓటు వివరాల మార్పునకు (ఫారం–8) సంబంధించి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో మొత్తం 6,823 దరఖాస్తులు అందగా 940 తిరస్కరణకు గురయ్యాయి. 5,983 దరఖాస్తులు ఆమోదం పొందాయి.

**దరఖాస్తులు ఇలా....**

- ఓటు నమోదుకు (ఫారం–6) సంబంధించి 2,480 దరఖాస్తులు అందాయి. ఇందులో 510 దరఖాస్తులు తిరస్కరించారు. 1,969 దరఖాస్తులు ఆమోదించారు.
- ఓటు తొలగింపునకు (ఫారం–7) సంబంధించి 1,262 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 116 దరఖాస్తులు తిరస్కరించారు. 1,146 దరఖాస్తులు ఆమోదించారు.
- ఓటు వివరాల మార్పునకు (ఫారం–8) సంబంధించి 3,181 దరఖాస్తులు అందాయి. ఇందులో 313 దరఖాస్తులు తిరస్కరించారు. 2,868 దరఖాస్తులు ఆమోదించారు.



దరఖాస్తులపై ర్యాండమ్ చెక్ నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

**20.20 లక్షలు ఓటర్లు..**

అక్టోబరు 29న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 20,20,441 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,98,784 మంది, మహిళ ఓటర్లు 10,21,412 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 245 మంది ఉన్నారు. ప్రస్తుతం ఓటరు జాబితా సవరణ-2025 ప్రక్రియలో అందిన దరఖాస్తుల్లో అర్హులైన వారిని ఓటరుగా జాబితాలో చేరుస్తారు. ఓటు తొలగింపునకు ఆమోదం పొందిన వాటిని జాబితా నుంచి తొలగిస్తారు. ఓటు వివరాల మార్పునకు ఆమోదం పొందిన వాటిని సరిచేసి తుది ఓటరు జాబితాను రూపొందిస్తారు.

**దరఖాస్తులు (ఫారం-6,7,8) ఇలా**

| నియోజక వర్గం | అందిన దరఖాస్తులు | తిరస్కరణ | ఆమోదం |
|---|---|---|---|
| రాయదుర్గం | 1,121 | 78 | 1,043 |
| ఉరవకొండ | 495 | 54 | 441 |
| గుంతకల్లు | 1,045 | 167 | 878 |
| తాడిపత్రి | 940 | 96 | 844 |
| శింగనమల | 624 | 26 | 598 |
| అనంతపురం | 1,111 | 215 | 896 |
| కళ్యాణదుర్గం | 913 | 62 | 851 |
| రాప్తాడు | 673 | 242 | 432 |
| మొత్తం | 6,923 | 940 | 5,983 |

**జనవరి 6న ప్రకటన..**

ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం తుది ఓటరు జాబితాను 2025 జనవరి 6వ తేదీన ప్రకటిస్తారు. ఓటరు జాబితా ప్రచురణను ఎన్నికల కమిషన్ అనుమతిని జనవరి 1వ తేదీన తీసుకుని ముద్రణ ప్రక్రియ చేపడతారు. జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విడుదల చేస్తారు.

# రబీకి టాటా

- సీజన్‌లో 22 శాతం అధిక వర్షపాతం
- 70 శాతం విస్తీర్ణంలో పంటలు



**అనంతపురం అగ్రికల్చర్:** రబీ పంటల సాగుకు సమయం ముగిసింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు మూడు నెలల పాటు రబీ కింద వివిధ పంటలు సాగు చేస్తారు. జిల్లాలో ప్రధాన పంట పప్పుశనగ కాగా తర్వాత వేరుశనగ, వరి, జొన్న, మొక్కజొన్న, ఉలవ తదితర పంటలు వేస్తారు. ఈ రబీలో జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 1,18,350 హెక్టార్లు కాగా 70 శాతం విస్తీర్ణం అంటే 82 వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. నల్లరేగడి భూములు కలిగిన 25 మండలాల పరిధిలో అత్యధికంగా 62 వేల హెక్టార్లలో పప్పుశనగ, నీటి వసతి కింద వేరుశనగ 7 వేల హెక్టార్లు, వరి 1,000 హెక్టార్లు, జొన్న 4,700, మొక్కజొన్న 4,200, ఉలవ 3 వేల హెక్టార్లు కాగా సజ్జ, పెసర, మినుము, పొద్దుతిరుగుడు, సోయాబీన్ తదితర పంటలు కొంత విస్తీర్ణంలో సాగులోకి వచ్చాయి. వరి, వేరుశనగ సాగు విస్తీర్ణం మరికొంత పెరిగే పరిస్థితి ఉందని అధికారులు తెలిపారు.

- రబీ మూడు నెలల కాలంలో సాధారణ వర్షపాతం 139.3 మి.మీ కాగా 22 శాతం అధికంగా 170.6 మి.మీ నమోదైంది. అక్టోబర్‌లో 135.1 మి.మీ, నవంబర్‌లో 18.2, డిసెంబర్‌లో 17.3 మి.మీ వర్షం కురిసింది. ఖరీఫ్‌కు సంబంధించి జూన్ నుంచి సెప్టెంబర్ వరకు 319.7 మి.మీ గానూ 34.9 శాతం అధికంగా 431.3 మి.మీ వర్షం కురిసిన విషయం తెలిసిందే. ఓవరాల్‌గా చూస్తే గత జూన్ నుంచి ఇప్పటి వరకు 459 మి.మీ గానూ 31.1 శాతం అధికంగా 601.9 మి.మీ నమోదైంది. ఖరీఫ్‌లో 36, రబీలో 13... వెరసి ఈ ఏడాది 49 వర్షపు రోజులు (రెయినీడేస్) రికార్డయ్యాయి. తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాల్లో సాధారణం కన్నా తక్కువగా, 8 మండలాల్లో సాధారణంగా, 21 మండలాల్లో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదైంది.అధిక వర్షపాతం నమోదైనా... ఖరీఫ్, రబీ పంటల కీలక దశలుగా భావించే జూలై, సెప్టెంబర్, నవంబర్‌లో వర్షాలు తక్కువగా కురవడం విశేషం. జూన్, ఆగస్టు, అక్టోబర్, డిసెంబర్‌లో సాధారణం కన్నా అధిక వర్షాలు కురవడం గమనార్హం. దీంతో డ్రైస్పెల్స్ కూడా నమోదు కావడం, పంట దిగుబడులు తగ్గిపోవడం, కరువు పరిస్థితులు నెలకొనడంతో రైతులకు నష్టాలు మిగిలాయని చెబుతున్నారు.

# ప్రధాని మోదీతో ముఖాముఖి అవకాశం

**అనంతపురం ఎడ్యుకేషన్:** ''పరీక్షపే చర్చ–2025' కార్యక్రమం ద్వారా 6–12 తరగతులు చదువుతున్న విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రధానిని కలుసుకునే అవకాశం కల్పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమం కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ప్రస్తుత విద్యాపరమైన సవాళ్లకు చక్కటి పరిష్కారాలు కనుగొనే ఈ వేదికపై అభిప్రాయాలు, అనుమానాలను పంచుకోవచ్చు' అని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. విద్యాపరమైన సవాళ్లకు వినూత్న పరిష్కారాలను కనుగొనేందుకు, స్ఫూర్తిదాయకమైన కథనాలను పంచుకోవడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఇదో చక్కటి వేదికగా నిలుస్తుందన్నారు. 'పరీక్ష ఒత్తిడిని తగ్గించడం', 'సమర్థవంతమైన సమయ నిర్వహణ', 'వినూత్న అభ్యసన పద్ధతులు', 'విద్యలో సాంకేతికత ప్రాముఖ్యత-పాత్ర', 'విద్యావేత్తలకు తల్లిదండ్రుల మద్దతు' అంశాలపై వృత్తిపరమైన సూచనల కోసం ప్రశ్నలు ఆన్‌లైన్‌లో పంపాలని పేర్కొన్నారు. https://innovateindia1.mygov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 14 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కోసం డైట్ అధ్యాపకులు, 'పరీక్ష పే చర్చ' నోడల్ అధికారులు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ 99499 93712, ఎం.లక్ష్మీ నారాయణరెడ్డి (అనంతపురం) 83280 12659, పోలా లక్ష్మీనారాయణ (శ్రీ సత్యసాయి) 94409 44737ను సంప్రదించాలని కోరారు.

### పింఛన్.. టెన్షన్

ఇంటి ముంగిటే పింఛన్ అందజేస్తామని కూటమి సర్కారు చెబుతున్నా... చాలా ప్రాంతాల్లో అమలు కావడం లేదు. ఈ క్రమంలో వృద్ధులు, దివ్యాంగుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పింఛన్ పంపిణీ ప్రారంభమైన మంగళవారం కూడా జిల్లాలోని పలు చోట్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పింఛన్ ఇవ్వడానికి మూడు నెలలుగా ఎవరూ ఇంటి వద్దకు రావడం లేదని అనంతపురం శ్రీనివాసనగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు వాపోయారు. గత ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎలాంటి చింత లేకుండా సొమ్ము అందుకున్న లబ్ధిదారులు... నేడు ఇబ్బందులు ఎదుర్కొంటుండం గమనార్హం. మరోవైపు జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ 94 శాతం పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



మంగళవారం ఉదయం 11 గంటలైనా ఇంటికొచ్చి పింఛన్ ఇవ్వకపోవడంతో అనంతపురం శ్రీనివాసనగర్‌లో ఉన్న సచివాలయం వద్ద ఎదురుచూస్తున్న వృద్ధులు, దివ్యాంగులు

## ఎల్‌సీ గేట్‌ను ఢీకొన్న ఆటో



రోడ్డుకు అడ్డంగా పడిన ఎల్‌సీ గేట్

గుంతకల్లు: స్థానిక హనుమన్ హల్ట్ రైల్వేస్టేషన్ మార్గంలోని ధర్మవరం (డీఎంఎం) రైల్వే ఎల్‌సీ గేట్‌ను ప్రమాదవశాత్తు ఆటో ఢీకొంది. మంగళవారం సాయంత్రం రైలు వస్తున్న సమయంలో గేట్ మ్యాన్ హరన్ మోగిస్తూ లెవల్ క్రాసింగ్ గేట్‌ను వేస్తుండగా అటు వైపు నుంచి ఓ ఆటో డ్రైవర్ ఎలాగైనా గేట్‌ను దాటాలానే ఉద్దేశ్యంతో అతి వేగంగా దూసుకొచ్చాడు. వేగాన్ని నియంత్రించుకోలేక అప్పటికే కిందకు దిగుతున్న గేట్‌ను ఢీకొని ముందుకెళ్లిపోయాడు. గేట్ వంగిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. గేట్ మ్యాన్ సమాచారంతో అప్రమత్తమైన అధికారులు తక్షణమే మరమ్మతు పనులు చేపట్టారు.

## యువకుడి బలవన్మరణం



నరేష్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని మారంపల్లి కాలనీకు చెందిన సరోజమ్మ, హుస్సేనప్ప దంపతులు బతుకు తెరువు కోసం బెంగళూరుకు వలస వెళ్లి అక్కడే కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు నరేష్ (26) గ్రామాల్లో ఆటోలో సంచరిస్తూ గృహోపకరణాల విక్రయంతో ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మారంపల్లి కాలనీలోని తన ఇంట్లో మంగళవారం నరేష్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, బెంగళూరులో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కాగా, నరేష్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. తల్లిదండ్రుల వచ్చిన తర్వాత వారు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని పోలీసులు పేర్కొన్నారు.

## ఫ్రెండ్‌షిప్ సిరీస్ విజేత పీకే స్పోర్ట్స్

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా అండర్-14 హట్‌హాక్స్ న్యూజిలాండ్, పీకే స్పోర్ట్స్ టీమ్ - హైదరబాద్ జట్ల మధ్య జరిగిన ఫ్రెండ్‌షిప్ సిరీస్‌ను పీకే స్పోర్ట్స్ హైదరాబాద్ జట్టు దక్కించుకుంది. రెండు జట్లు మూడు వన్డే మ్యాచ్‌లు ఆడగా, హైదరాబాద్ మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. హసీబ్ హమీద్ (ఇంగ్లడ్ టెస్ట్ క్రికెటర్) , న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ (బ్రూస్ ఎడ్గార్), ఆంధ్రా మాజీ క్రికెటర్ కేఎస్ షాబుద్దీన్, పీకే స్పోర్ట్స్ ప్రొపరైటర్ ప్రవీత్, ఏసీఏ కోచ్ కె.నరేష్ టోర్నీలో పాల్గొన్నారు. మంగళవారం జరిగిన చివరి వన్‌డేలో హట్‌హాక్స్ పది వికెట్ల నష్టానికి 194 పరుగులు చేయగా, పీకే స్పోర్ట్స్ నాలుగు వికెట్ల నష్టానికి 197 పరుగుల లక్ష్యాన్ని సాధించింది.



# డబుల్ కిక్కు!



- నగటున రోజూ రూ.6 కోట్ల విలువైన మద్యం విక్రయాలు
- డిసెంబర్ 31న ఒకే రోజు రూ.11.50 కోట్ల మద్యం సరఫరా
- చివరకు ఆస్పత్రుల్లోనూ మద్యం హోర్డింగ్‌ల ఏర్పాటుతో సామాన్యుల విస్మయం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇప్పటికే బెల్టుషాపులు, పర్మిట్ రూముల పేరుతో పల్లెల్లో మద్యం ఏరులై పారిస్తున్న కూటమి సర్కారు... కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే సందర్భంగా మరింత ముందడుగు వేసింది. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికే డిసెంబరు 31ని దృష్టిలో ఉంచుకుని మద్యం వినియోగం పెరుగుతుందని భారీగా సరఫరా చేసింది.

**తాగుతూ.. తూలుతూ..**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సగటున రోజూ రూ.6 కోట్ల విలువైన మద్యాన్ని అనుమతి పొందిన దుకాణాలకు సరఫరా అయ్యేది. ఈ క్రమంలో డిసెంబర్ 30వ తేదీ అర్ధరాత్రి వరకూ రమారమి రూ.11.50 కోట్ల మద్యాన్ని షాపులకు స్టాకు పంపించారు. ఏ ఒక్క మద్యం షాపులో కానీ, బార్‌లో కానీ ఒక్క బాటిల్ కూడా తక్కువ రాకుండా చూసుకోవాలన్న ఉద్దేశ్యంతో సర్కారు భారీగా స్టాకు పంపింది. దాదాపుగా రోజూ ఇచ్చే అమ్మకాల ఆర్డర్‌తో పోలిస్తే ఇది వంద శాతం ఎక్కువగా ఉండడం గమనార్హం. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచే మద్యం ప్రియులు షాపుల వద్ద బారులు తీరి తమకు కావాల్సిన బ్రాండ్‌లను కొనుగోలు చేశారు. రాత్రి 12 గంటల వరకూ ఇష్టారాజ్యంగా తాగుతూ తూలుతూ కనిపించారు. యువత కేకలు, టూవీలర్ల రైడింగ్‌తో రహదారులు హోరెత్తి పోయాయి.

**ఆస్పత్రులనూ వదలని కూటమి కిక్కు**

బడికి.. గుడికీ తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ షాపులు పెట్టి మద్యం కిక్కు ఎక్కించిన కూటమి సర్కారు... తాజాగా ఆస్పత్రులనూ వదల్లేదు. అనంతపురం నగరంలోని ఆస్పత్రి వద్ద ఏకంగా 'రవీంద్ర' వైన్స్ పేరుతో పెద్ద హోర్డింగ్ ఏర్పాటు చేశారు. ఆస్పత్రి గోడకు ఆనుకుని దీనిని ఏర్పాటు చేయడంతో పేషెంట్లు విస్తుపోతున్నారు. కనీసం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఈ హోర్డింగ్‌ను తీసెయ్యలేదు. చిన్నపాటి ఫ్లెక్సీ కడితే తీసేసే మున్సిపల్ అధికారులూ సైతం స్పందించలేదు. ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపుల హోర్డింగ్‌లతో జనాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.




అనంతపురంలోని రెవెన్యూ కాలనీ వద్ద ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ఫ్లెక్సీ



అనంతపురంలోని ఓ మద్యం దుకాణం వద్ద కొనుగోలుదారుల రద్దీ

**డిసెంబర్ 31 కోసం లిక్కర్ డిపో నుంచి సరఫరా అయిన మద్యం వివరాలు..**

**అనంతపురం జిల్లాలో**

| | |
|---|---|
| లిక్కర్ కేస్‌లు | 9,674 |
| బీర్ కేసులు | 3,794 |
| మొత్తం విలువ | రూ.7,61,38,630 |

**శ్రీసత్యసాయి జిల్లాలో**

| | |
|---|---|
| లిక్కర్ కేస్‌లు | 5,193 |
| బీర్ కేసులు | 2,467 |
| మొత్తం విలువ | రూ.3,87,38,076 |

రెండు జిల్లాల్లో మొత్తం మద్యం సరఫరా విలువ రూ.11,48,76,707



## పామిడి సీహెచ్‌సీలో వైద్యుల నిర్లక్ష్యం

పామిడి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో వైద్య సేవలు అధ్వానంగా మారాయి. రోగుల సేవల్లో నాణ్యత ప్రమాణాలు లోపించడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఛాతీలో నొప్పితో ఆస్పత్రికి వెళ్లిన రోగుల పట్ల విధుల్లో ఉన్న డాక్టర్లు కనబరిచిన నిర్లక్ష్యమే ఇందుకు నిదర్శనం. వివరాలు... పామిడిలోని తలవాలకట్ట ప్రాంతానికి చెందిన అన్నదమ్ములు అబుసాలేహా, రఫీ మంగళవారం ఛాతి నొప్పితో సీహెచ్‌సీకి వెళ్లారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న డాక్టర్ ఈసీజీకి రెఫర్ చేశారు. రెండు గంటల పాటు ఈసీజీ గది వద్ద పడిగాపులు కాసినా ఫలితం లేకపోయింది. ఆలస్యంగా అక్కడకు చేరుకున్న సాంకేతిక నిపుణుడు ఈసీజీ యంత్రం పనిచేయడం లేదని తెలపడంతో అన్నదమ్ములు ఆందోళనకు గురయ్యారు. ఒకవేళ తమ పరిస్థితి విషమించి ఉంటే కుటుంబసభ్యుల పరిస్థితి ఏమిటని డాక్టర్‌ను ప్రశ్నించారు. ఈసీజీ యంత్రం పనిచేయదని తెలిసి కూడా గంటల తరబడి తమను వేచి ఉండేలా చేయడం సబబు కాదన్నారు. ఇక్కడ చికిత్స చేయడం సాధ్యం కాదని చెబితే జిల్లా కేంద్రానికి వెళ్లే వారమన్నారు. దీంతో డ్యూటీ డాక్టర్లు ఒక్కసారిగా అన్నదమ్ముళ్లపై విరుచుకుపడ్డారు. 'ఇప్పుడేమైంది? అనంతపురానికి వెళ్లండి' అంటూ కేకలు వేశారు. దీంతో ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన పలువురు రోగులు విస్తుపోయారు. నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించడమే కాక, రోగులపై చిందులేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

## యువకుడికి రిమాండ్

గార్లదిన్నె: పోక్సో కేసులో ఓ యువకుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న కేశవాపురం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను వివాహం చేసుకుంటానని కొప్పలకొండకు చెందిన సుధీర్ ఇంటికి పిలుచుకెళ్లాడు. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో తక్షణమే స్పందించిన పోలీసులు బాలికను కాపాడి తల్లిదండ్రులకు అప్పగించారు. విచారణ అనంతరం సుధీర్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. మంగళవారం సుధీర్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

## మద్యం అక్రమ రవాణాదారుడి అరెస్ట్

పెనుకొండ రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలు.. మంగళవారం ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 288 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని గోరంట్ల మండలం వానవోలు క్రాస్ సమీపంలో నవాబు కోట గ్రామానికి చెందిన తిరుపాల్‌ను అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఆటోను సీజ్ చేసినట్లు ఎస్టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ధర్మవరం అర్బన్: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని ఎర్రగుంటకు చెందిన ధనుంజయ (40)కు భార్య అరుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. బార్బర్ షాప్ ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో నూతన సంవత్సర వేడుక సందర్భంగా తన బార్బర్ షాప్‌ను మంగళవారం రాత్రి ధనుంజయ ముస్తాబు చేశాడు. చివరన బోర్డు అమరుస్తుండగా ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్ మెయిన్ లైన్ తీగలు తగలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

# టీడీపీ గూండాలను అరెస్ట్ చేయాలి

- పోలీసులు ఏకపక్ష ధోరణి వీడాలి
- డీఎస్పీని కోరిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి
- ఎస్‌ఐ రాఘవేంద్రను సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణుల ధర్నా



డీఎస్పీ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

గుంతకల్లు టౌన్: మండలంలోని చింతలాంపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై మారణాయుధాలతో దాడి చేసిన టీడీపీ గూండాలను తక్షణమే అరెస్ట్ చేయాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న చింతలాంపల్లిలో రాజకీయ కక్షలను ప్రేరేపిస్తున్న టీడీపీ శ్రేణులు, వారికి కొమ్ముకాస్తున్న గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్ప వైఖరిని నిరసిస్తూ మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు టీడీపీ నాయకుల ఆగడాలకు వంత పాడుతున్న రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్పను వెంటనే సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ... గత వైఎస్సార్‌సీపీ పాలనలో గుంతకల్లు నియోజకవర్గంలోని పల్లెలన్నీ ప్రశాంతంగా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొందరు టీడీపీ నాయకులు పోలీసులను లోబర్చుకుని గ్రామాల్లో అలజడి సృష్టిస్తున్నారన్నారన్నారు. చింతలాంపల్లిలో రూరల్ పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ శ్రేణులపై విచక్షణా రహితంగా దాడులు జరగడం బాధాకరమన్నారు. దాడులను అరికట్టకపోగా బాధితుల పైనే కేసులు నమోదు చేయడం అక్కడే ఉన్న పోలీసుల ఏకపక్ష ధోరణికి నిదర్శనమన్నారు. బాధితులకు న్యాయం చేకూర్చడంతో పాటు నియోజకవర్గంలోని గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. లేకపోతే ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ... జరిగిన ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి న్యాయం చేకూరుస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువ నేత మంజునాథరెడ్డి, జిల్లా కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజినేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, చింతలాంపల్లి సర్పంచ్ పద్మావతి, బొజ్జన్న, పార్టీ సీనియర్ నాయకులు యుగంధర్‌రెడ్డి, భీమలింగప్ప, నూర్, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్‌సభ్యులు, వార్డు ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరణించినా.. మహోపకారం

- వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి మృతి
- నేత్రదానంతో మరో నలుగురికి చూపు



ధర్మవరానికి చెందిన శివానంద (ఫైల్)

కూడేరు/ధర్మవరం అర్బన్ : మరణానంతరం నేత్రదానం చేసి మరో నలుగురికి చూపును ప్రసాదించారు కూడేరు మండలం చోళసముద్రానికి చెందిన సంజీయరాయుడు కుమారుడు సందీప్ (35), ధర్మవరంలోని పీఆర్‌టీ వీధికి చెందిన శింగనమల శివానంద (78). వివరాలు... సోమవారం రాత్రి తమ పొలంలో కొబ్బరి చెట్టు పట్టలు తొలగిస్తూ లింగంశెట్టి సందీప్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం అనంతపురంలోని సర్వజన ఆస్పత్రిలో సందీప్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వారు సందీప్ కుటుంబసభ్యులతో మాట్లాడారు. మరణానంతరం నేత్రదానంతో మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించవచ్చునని తెలిపారు. కుటుంబసభ్యుల అనుమతితో సందీప్ మృతదేహం నుంచి నేత్రాలను సేకరించి, ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

- అనారోగ్యంతో బాధపడుతున్న ధర్మవరంలోని పీఆర్‌టీ వీధికి చెందిన శింగనమల శివానంద మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ బీవీ సుబ్బారావు, వైకే శ్రీనివాసులు... ఆస్పత్రి వద్దకు చేరుకుని నేత్రదానం ఆవశ్యకతపై బాధిత కుటుంబసభ్యులను చైతన్య పరిచారు. అనంతరం మృతుడి కుమారుడు శివకిషోర్, వెంకటమహేస్ అంగీకరించడంతో శివానంద నేత్రాలను సేకరించి ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు పంపారు. నేత్రదానం చేసిన మృతుని కుటుంబ సభ్యులకు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# సీఐ శాంతిలాల్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలి




జిల్లా కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

- నిరసన ర్యాలీలో న్యాయవాదులు

అనంతపురం: సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి మృతికి కారణమైన అనంతపురం మూడో పట్టణ సీఐ శాంతిలాల్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ న్యాయవాదులు డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు వెంకట్రాముడు, బడా నారాయణరెడ్డి మాట్లాడారు. శేషాద్రి మృతి కేసు విచారణను సీబీడీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకున్న ఘటనపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. పోలీసులు పేర్కొంటున్నట్లు శేషాద్రి కుప్పకూలిన వెంటనే అక్కడే ఉన్న పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించే అవకాశమున్నా.. ఆ దిశగా స్పందించకపోవడం, ఎఫ్ఐఆర్ నమోదుకు 7 గంటల కాలయాపన చేయడం తదితర అంశాలను బట్టి శేషాద్రి మృతికి పోలీసులే కారణమన్నది స్పష్టమవుతోందన్నారు. ఈ కేసు దర్యాప్తును సీబీసీఐడీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది రామలింగారెడ్డి మాట్లాడుతూ.. శేషాద్రి మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శేషాద్రిని విచారణ పేరుతో రాత్రి వేళల్లో పిలిపించి కక్షిదారుల ముందు అవమానకరంగా మాట్లాడి బెదిరించడంతోనే గుండె పోటుతో సీఐ ఛాంబర్‌లోనే మృతి చెందారన్నారు. మృతి చెందిన అనంతరం కనీస సహకారం అందించకపోగా జూనియర్ న్యాయవాదుల సెల్‌ఫోన్లు లాక్కొని దౌర్జన్యం చేసిన ఘటన, న్యాయవాదులు పోస్టుమార్టం నిర్వహించాలని కోరితే పోలీసులు కుంటి సాకులు చెబుతూ పోస్టుమార్టం అవసరం లేదని వాగ్వాదానికి దిగడాన్ని బట్టి శేషాద్రి మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ర్యాలీలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ గోవింద్, సీనియర్ న్యాయవాదులు గాజుల ఉమాపతి, ఈ.వెంకట్రాముడు, హనుమన్న, పుల్లయ్య బాబు, శ్రీనివాసరెడ్డి, సతీష్, వీరమాసప్ప, పురుషోత్తం, రాఘవేంద్ర, పద్మజ, వహీదా, పద్మావతి, లక్ష్మీశ్రీకాంత్‌రెడ్డి, రేవతి, అవ్వ సురేష్, భరత్, భూషణ్ రెడ్డి, రామకృష్ణ, ఎల్‌కే సురేంద్రనాథ్, శ్రీకాంత్, రాఘవేంద్ర, బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వైస్ చైర్మన్ల రాజీనామా





మాట్లాడుతున్న అబ్దుల్ రహీం, సరస్వతి

తాడిపత్రి రూరల్: స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్లు ఇద్దరూ తమ పదవులకు రాజీనామా చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ మీట్‌లో తమ రాజీనామాను అబ్దుల్ రహీం, సరస్వతి ప్రకటించారు. మొదట వైస్ చైర్మన్ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో కౌన్సిల్ మీట్ జరిగింది. ప్రారంభంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతికి కౌన్సిల్ సంతాపం తెలిపింది. అనంతరం సభ్యులు 11 అంశాలకు సంబంధించిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణకు వారు అందజేసి, మాట్లాడారు. దాదాపు మూడేళ్ల పాటు వైస్ చైర్మన్లుగా తమకు అవకాశం ఇచ్చినందుకు కౌన్సిల్‌కు ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన కౌన్సిలర్లకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశ్యంతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

## కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థుల ఎత్తును పరిశీలిస్తున్న దృశ్యం (చిత్రంలో) ఎస్పీ జగదీష్

అనంతపురం: స్థానిక నీలం సంజీవరెడ్డి స్టేడియం వేదికగా చేపట్టిన కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం రెండో రోజూ కొనసాగాయి. ఎస్పీ పి.జగదీష్ అక్కడే ఉండి ప్రక్రియను పర్యవేక్షించారు. మొత్తం ప్రక్రియను వీడియో తీయించారు. అభ్యర్థులు మైదానంలోకి అడుగుపెట్టింది మొదలు తిరిగి బయటకు వెళ్లే వరకూ ఆయా విభాగాల సిబ్బంది పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రక్రియకు పురుష అభ్యర్థులు 5,242, మహిళా అభ్యర్థులు 1,237 మంది హాజరుకానున్నారు. పరీక్షల్లో భాగంగా 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. దేహదారుఢ్య పరీక్షల్లో అనుమానాలు ఉంటే ఈ 17న అప్పీలు చేయాలని అభ్యర్థులకు ఎస్పీ సూచించారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

- మేయర్ వసీం



**అనంతపురం కార్పొరేషన్:** నగర ప్రజలకు మేయర్ వసీం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంగ్ల నామ సంవత్సరంలో ప్రజలందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ న్యూ ఇయర్‌ను సంతోషంగా జరుపుకోవాలన్నారు. అదేవిధంగా నూతన సంవత్సరంలో నగరాభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.





టవర్‌క్లాక్ వద్ద న్యూ ఇయర్ జోష్..



యువతుల నూతన సంవత్సర సంబరాలు

# కొత్త సంవత్సరం.. కొంగొత్త ఆశలు

- 2024కు వీడ్కోలు
- నగరమంతటా నూతన సంవత్సర సందడి

**అనంతపురం కల్చరల్:** మంచి, చెడు, సంతోషం, బాధ ఇలా ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చిన 2024 సంవత్సరానికి నగర ప్రజలు వీడ్కోలు పలికారు. నూతన సంవత్సరం 2025 రాకతో పులకించిపోయారు. అడుగడుగునా సంబరాల్లో మునిగి తేలారు. మంగళవారం ఉదయం నుంచే నగరమంతటా సందడి వాతావరణం నెలకొంది. మహిళలు నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఇళ్ల ముందు రంగవల్లులు వేశారు. ముఖ్యంగా టవర్‌క్లాక్ సెంటర్, సప్తగిరి సెంటర్, శ్రీకంఠం సర్కిల్ తదితర ప్రదేశాల్లో కేక్ కట్ చేసి అందరితో ఆనందాలు పంచుకున్నారు. అర్ధరాత్రి వరకూ నగరంలోని ప్రధాన కూడళ్లన్నీ జనప్రవాహంతో నిండిపోయాయి. యువకులు కేరింతలు కొడుతూ అందరిని పలకరిస్తూ 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాలు, క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కళా సంస్థల్లో జరిగిన సంగీత కచేరీ, హాస్యవల్లరులు ఆకట్టుకున్నాయి.



కేక్ కట్ చేస్తున్న ఓ కుటుంబం

## వైఎస్సార్‌టీఏ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామి రెడ్డి



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు, ఎస్టీయూ నాయకులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) 2025 క్యాలెండర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మంగళవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను ఎండగడుతూ టీచర్ల పక్షాన నిలబడాలని వైఎస్సార్‌టీఏ నాయకులకు సూచించారు. తమవంతుగా పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ రెడ్డి, గోవిందరెడ్డి, రమణ, గోపాల్, కృష్ణా నాయక్, గంగాధర్‌రెడ్డి, రామకృష్ణా, వెంకటరెడ్డి, రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.

**ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ**

**అనంతపురం ఎడ్యుకేషన్:** రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ నారాయణ స్వామి, నగర కార్యదర్శి శ్రీరాములు, కేశవరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో అందరూ సమష్టిగా పని చేసి ఎస్టీయూను అగ్రభాగాన నిలుపుదామని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణా రెడ్డి, రామాంజనేయులు, రాష్ట్ర అదనపు కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు ఫణిభూషణ్, శివయ్యచారి, సురేష్‌బాబు, రఫి, గోవిందు, అజయ్ కుమార్, రవి, మురళీకృష్ణ, కృష్ణమూర్తి నాయుడు, శ్రీనివాసులు నాయక్, చలపతి పాల్గొన్నారు.

## అంధులకు రేపు చెస్ పోటీలు

**అనంతపురం కల్చరల్:** జాతీయ అంధుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు క్రీడా వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సమాఖ్య ప్రతినిధి రవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి సారి గురువారం ఉదయం 9:30 గంటలకు అంధులకు చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటూ సర్వసభ్య సమావేశం ఉంటుందని తెలిపారు. శనివారం లూయిీ బ్రెయిల్ జయంతి సందర్భంగా వివిధ సంస్థల రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఉదయం 10 గంటలకు సమావేశం, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. మూడు రోజుల పాటూ స్థానిక కృష్ణకళామందిరం వేదికగా సాగే అంధుల వేడుకల్లో పాల్గొనాలని అంధుల సమాఖ్య జిల్లా శాఖ నిర్వాహకులు కోరారు.

## 'మాంటిస్సోరి'లో నూతన సంవత్సర వేడుకలు



టోపీలు ధరించిన చిన్నారులతో కరస్పాండెంట్ సూర్యనారాయణ రెడ్డి

**అనంతపురం ఎడ్యుకేషన్:** స్థానిక సంగమేష్ నగర్, గుత్తి రోడ్డులోని మాంటిస్సోరి విద్యాసంస్థల్లో మంగళవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల ఆవరణాలను రంగురంగుల బెలూన్లతో అందంగా అలంకరించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ సి.సూర్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు రంగు రంగుల టోపీలు ధరించి 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ సందడి చేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాంటిస్సోరి విద్యాసంస్థల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాల్ కె.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'ప్రైవేట్ భాగస్వామ్యం సరికాదు'

**అనంతపురం అర్బన్:** 'నదుల అనుసంధానాన్ని స్వాగతిస్తున్నాం. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాకుండా ప్రాజెక్టు నిర్మాణానికి ప్రైవేట్ భాగస్వాములను పిలవడం సరైంది కాదు.' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గోదావరి-కృష్ణ నదుల అనుసంధానం మంచి కార్యక్రమమే అన్నారు. అయితే దేశంలో ఎక్కడా కూడా నదుల అనుసంధాన ప్రాజెక్టుల్లో ప్రైవేటు భాగస్వామ్యం లేదన్నారు. ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తే వారు ధనార్జనే ధ్యేయంగా పని చేస్తారన్నారు. జాతీయ రహదారులపై టోల్ గేటు పెట్టినట్లు.. నీటికి కూడా మీటర్లు పెట్టి డబ్బులు వసూలు చేయాల్సి వస్తుందన్నారు. ప్రైవేటు భాగస్వాములు తాగు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అడుగుపెడితే రైతులు, ప్రజలకు నష్టం తప్పదన్నారు. ప్రైవేటు భాస్వామ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనుమతించకూడదని డిమాండ్ చేశారు. తిరుమలలో సామాన్య భక్తులు కూడా ఎల్2 దర్శనాలు చేసుకునే విధంగా పాలకమండలి నిర్ణయం తీసుకోవాలన్నారు. అదే విధంగా రూ.300 టికెట్ తీసుకున్న భక్తులకు సరైన వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, నాయకులు కేశవరెడ్డి, శ్రీరాములు, అల్లీపీరా, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

## ఎంపీపీ నాగమ్మ సేవలు మరువలేనివి

**రామగిరి:** మండల పరిషత్ చైర్‌పర్సన్ మీనుగ నాగమ్మ సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, పార్టీ సీనియర్ నేత తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి కొనియాడారు. అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి నాగమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న వారు మంగళవారం రామగిరికి చేరుకుని నాగమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ... బడుగు, బలహీనవర్గాకు మొదట నుంచి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచిందన్నారు. ఈ క్రమంలో బీసీలకు ఉన్నత స్థాయి పదవులు కట్టబెట్టిందన్నారు. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా రామగిరి మండలం పది ఎంపీటీసీ స్థానాలకు గాను తొమ్మిదింటిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ప్రజలు గెలిపించుకున్నారు. వీరిలో బీసీ మహిళ అయిన మీనుగ నాగమ్మ.. ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించి మండల అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ఆమె మృతి పార్టీకి తీరనిలోటన్నారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని నాగమ్మ కుమారుడు సర్పంచ్ మీనుగ నాగరాజును ఓదార్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు నాగార్జున, మారుతీ ప్రసాద్, మెట్టు గోవిందరెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు కగ్రా హనుమంతరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు ఓబిరెడ్డి, ఆదిరెడ్డి, నరసింహారెడ్డి, రాజేష్, నరేంద్ర, సిద్ధన్న, వెంకటరెడ్డి, రామ్మూర్తి, రామాంజినేయులు, కురుబ ముత్యాలప్ప, రమేష్, దాసరి మోహన్, మనీష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



నాగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గోరంట్లమాధవ్

## ఆకట్టుకున్న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

**చెన్నేకొత్తపల్లి:** విద్యార్థుల్లోని సృజనాత్మకతను గుర్తించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. నాగసముద్రం, కనుముక్కల, మేడాపురం, వెల్దుర్తి, వెంకటాంపల్లి, చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలు పాల్గొన్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సబ్జెక్టుల వారీగా ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎంఈఓ-2 ప్రసూన్ కుమార్ నాయుడు, పలువురు హెచ్ఎంలు మండల స్థాయిలో ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేశారు. వెల్దుర్తి, కనుముక్కల చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.



- నేడు నృత్య ప్రదర్శనలు

**అనంతపురం కల్చరల్:** ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లలిత కళాపరిషత్తు కార్యదర్శి పద్మజ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ జిల్లాలోని ప్రముఖ డ్యాన్స్ మాస్టర్లందరూ తమ శిష్య బృందాలతో చేసే ఆటపాటల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# వరుణ్ వీరోచిత సెంచరీ

**82 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 109 నాటౌట్**

- తిలక్ వర్మ 99 అవుట్
- కర్ణాటకపై హైదరాబాద్ గెలుపు
- మయాంక్ అగర్వాల్ శతకం వృథా


వరుణ్

**అహ్మదాబాద్:** భారీ లక్ష్యం ముందున్నా... ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడిన హైదరాబాద్ జట్టు విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో కర్ణాటక జట్టుపై మూడు వికెట్ల తేడాతో అద్భుత విజయం అందుకుంది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో హైదరాబాద్ రెండు బంతులు మిగిలి ఉండగా లక్ష్యాన్ని ఛేదించింది. వరుణ్ గౌడ్ (82 బంతుల్లో 109 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ శతకంతో హైదరాబాద్ జట్టును గెలిపించాడు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 320 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (112 బంతుల్లో 124; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరో సెంచరీతో చెలరేగగా... స్మరణ్ (75 బంతుల్లో 83; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్ 3 వికెట్లు పడగొట్టగా... అనికేత్ రెడ్డి 2 వికెట్లు తీశాడు. ముదస్సిర్, రోహిత్ రాయుడులకు ఒక్కో వికెట్ లభించింది. లక్ష్యఛేదనలో హైదరాబాద్ 49.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (106 బంతుల్లో 99; 7 ఫోర్లు, 1 సిక్స్) పరుగు తేడాతో శతకం చేజార్చుకోగా... వరుణ్ గౌడ్ వీరవిహారం చేశాడు. తిలక్, వరుణ్ ఐదో వికెట్‌కు 112 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కబెట్టారు. కీలక సమయంలో తిలక్ వెనుదిరిగినా... చివరి వరకు క్రీజులో నిలిచిన వరుణ్ గౌడ్ భారీ షాట్లతో విరుచుకుపడి జట్టును గెలిపించాడు. తనయ్ త్యాగరాజన్ (17 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్), వరుణ్ ఏడో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. చివరి ఓవర్ తొలి బంతికి తనయ్ అవుటైనా... చామా మిలింద్ (4 నాటౌట్)తో కలిసి వరుణ్ హైదరాబాద్‌ను విజయతీరాలకు చేర్చాడు. కర్ణాటక బౌలర్లలో ప్రవీణ్ దూబే, నికిన్ జోస్ చెరో రెండు వికెట్లు తీశారు. వరుణ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తమ తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం పంజాబ్‌తో హైదరాబాద్ ఆడుతుంది.

# వారెవ్వా వైశాలి

**మహిళల విభాగంలో అగ్రస్థానంతో నాకౌట్‌కు అర్హత**

- హంపి చేజారిన అవకాశం
- వరల్డ్ చెస్ 'బ్లిట్జ్' చాంపియన్‌షిప్



**న్యూయార్క్:** భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్ బాబు 'ఫిడే' వరల్డ్ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. టోర్నీ తొలి రోజు మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ దశలో 11 గేమ్‌లలో కలిపి ఆమె మొత్తం 9.5 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. 8 గేమ్‌లు గెలిచిన వైశాలి 3 గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. తొలి నాలుగు గేమ్‌లను వరుసగా గెలుచుకొని 23 ఏళ్ల వైశాలి శుభారంభం చేసింది. ఐదో గేమ్‌లో ఆమెకు రష్యాకు చెందిన మాజీ బ్లిట్జ్ వరల్డ్ చాంపియన్ కేటరీనా లాగ్నోతో గట్టి పోటీ ఎదురైంది. హోరాహోరీ సమరం తర్వాత ఈ గేమ్ 'డ్రా'గా ముగిసింది. ఆ తర్వాత వైశాలి వరుసగా ఆరు, ఏడు, ఎనిమిదో గేమ్‌లలో విజయాలు సొంతం చేసుకుంది. ఎనిమిదో రౌండ్‌లో ప్రస్తుత వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్ వలెంటినా గునీనా (రష్యా)పై గెలవడం ఆమె ముందంజ వేయడంలో కీలకంగా మారింది. 9వ రౌండ్‌ను 'డ్రా'గా ముగించుకున్న అనంతరం పదో గేమ్‌లో పొలినా షువలోవా (రష్యా)ను ఓడించడంతో వైశాలికి అగ్రస్థానం ఖాయమైంది. దాంతో అమెరికాకు చెందిన కారిసా ఇప్‌తో జరిగిన 11వ గేమ్‌ను చకచకా 9 ఎత్తుల్లోనే 'డ్రా' చేసుకొని వైశాలి క్వాలిఫయింగ్ దశలో నంబర్‌వన్‌గా నిలిచింది. మొత్తం 8 మంది ప్లేయర్లు క్వార్టర్ ఫైనల్ (నాకౌట్) దశకు అర్హత సాధించారు. క్వార్టర్ ఫైనల్లో జూ జినర్ (చైనా)తో వైశాలి తలపడుతుంది. మరోవైపు వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కోనేరు హంపి నాకౌట్‌కు చేరలేకపోయింది. 11 రౌండ్‌ల తర్వాత మొత్తం 8 పాయింట్లతో ఆమె 9వ స్థానంతో ముగించింది. 8 గేమ్‌లను గెలిచిన హంపి...మరో 3 గేమ్‌లలో పరాజయం పాలైంది. ఎనిమిదో రౌండ్‌లో మరో భారత ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ చేతిలో అనూహ్యంగా ఓడటం హంపి అవకాశాలను దెబ్బ తీసింది. ఇతర భారత క్రీడాకారిణులు దివ్య దేశ్‌ముఖ్ (7 పాయింట్లు) 18వ ర్యాంక్‌లో, వంతిక అగర్వాల్ (7 పాయింట్లు) 19వ ర్యాంక్‌లో, ద్రోణవల్లి హారిక (7 పాయింట్లు) 22వ ర్యాంక్‌లో, నూతక్కి ప్రియాంక (5 పాయింట్లు) 70వ ర్యాంక్‌లో, పద్మిని రౌత్ (5 పాయింట్లు) 71వ ర్యాంక్‌లో, సాహితి వర్షిణి (4.5 పాయింట్లు) 76వ ర్యాంక్‌లో నిలిచారు. పాయింట్లు సమంగా ఉన్నపుడు మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరిస్తారు.

**అర్జున్‌కు నిరాశ...**

పురుషుల (ఓపెన్) విభాగంలో భారత ఆటగాళ్లలో ఎవరూ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు. మొత్తం 13 రౌండ్‌ల తర్వాత భారత్ నుంచి అత్యుత్తమంగా ఆర్.ప్రజ్ఞానంద 8.5 పాయింట్లతో 23వ స్థానంతో ముగించగా, రౌనక్ సాధ్వానికి 35వ స్థానం (8 పాయింట్లు) దక్కింది. తెలంగాణకు చెందిన అర్జున్ ఇరిగేశి 7 పాయింట్లు మాత్రమే సాధించి 64వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. తొలి 5 గేమ్‌లలో గెలిచి అగ్రస్థానంతో ముందుకు దూసుకుపోయిన అర్జున్‌కు ఆ తర్వాత అనూహ్య ఫలితాలు ఎదురయ్యాయి. తర్వాతి 5 రౌండ్‌లలో 2 ఓడి, 2 'డ్రా' చేసుకున్న అతను ఒకటే గేమ్ గెలవగలిగాడు. ఆఖరి 3 రౌండ్‌లలో వరుసగా అనీశ్ గిరి (నెదర్లాండ్స్), డెనిస్ లజావిక్ (రష్యా), కజిబెక్ నొగర్‌బెక్ (కజకిస్తాన్)ల చేతుల్లో ఓడటంతో రేసులో అర్జున్ పూర్తిగా వెనుకబడిపోయాడు.

# శ్రీకర్ భరత్, అశ్విన్ అజేయ సెంచరీలు

- మేఘాలయపై 10 వికెట్లతో ఆంధ్ర ఘనవిజయం
- 5 వికెట్లు పడగొట్టిన సందీప్
- విజయ్ హజారే ట్రోఫీ టోర్నీ


సందీప్

**ముంబై:** దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టు జోరు కొనసాగుతోంది. గ్రూప్ 'బి'లో భాగంగా ఆంధ్ర జట్టు నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఆంధ్ర 10 వికెట్ల తేడాతో మేఘాలయను మట్టికరిపించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ జట్టు 48.2 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ నిశాంత చక్రవర్తి (108 బంతుల్లో 101; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... అర్పిత్ (90 బంతుల్లో 66; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో రాణించాడు. దీంతో ఒకదశలో మేఘాలయ జట్టు 182/1తో పటిష్ట స్థితిలో కనిపించింది. అయితే ఆ తర్వాత ఆంధ్ర బౌలర్లు విజృంభించి వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టారు. దీంతో మేఘాలయ బ్యాటర్లు ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆంధ్ర బౌలర్లలో యారా సందీప్ 28 పరుగులిచ్చి 5 వికెట్లతో అదరగొట్టగా... ఆంజనేయులు, మహీప్ కుమార్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆంధ్ర 29.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 228 పరుగులు చేసింది. ఆంధ్ర కెప్టెన్ శ్రీకర్ భరత్ (81 బంతుల్లో 107 నాటౌట్; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీతో విజృంభించాడు. మరో ఓపెనర్ అశ్విన్ హెబర్ (96 బంతుల్లో 108 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) కూడా 'శత'క్కొట్టడంతో ఆంధ్ర జట్టు ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. మేఘాలయ బౌలింగ్‌ను ఓ ఆటాడుకున్న భరత్... సిక్స్‌లతో చెలరేగిపోతే అశ్విన్ బౌండరీలతో హోరెత్తించాడు. వీరిద్దరూ పోటీపడి పరుగులు రాబట్టడంతో లక్ష్యం చిన్నబోయింది. గత మ్యాచ్‌లో సర్వీసెస్‌పై అజేయ అర్ధశతకాలతో వికెట్ నష్టపోకుండానే జట్టును గెలిపించిన భరత్, అశ్విన్... ఈసారి కూడా దాన్ని పునరావృతం చేశారు. 5 వికెట్లు తీసిన సందీప్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్‌లో ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లాడిన ఆంధ్ర జట్టు 4 విజయాలు, ఒక పరాజయంతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని రెండో స్థానంలో కొనసాగుతోంది. తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం మహారాష్ట్రతో ఆంధ్ర జట్టు తలపడుతుంది.


అశ్విన్ | శ్రీకర్ భరత్

# పశ్చిమ బెంగాల్ 33వసారి...

- సంతోష్ ట్రోఫీ టైటిల్ సొంతం
- ఫైనల్లో కేరళపై విజయం

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ సంతోష్ ట్రోఫీలో 33వసారి పశ్చిమ బెంగాల్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. మంగళవారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో హోరాహోరీగా సాగిన తుదిపోరులో పశ్చిమ బెంగాల్ జట్టు 1-0 గోల్ తేడాతో కేరళ జట్టుపై విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్ తరఫున రోబీ హన్స్‌దా (90+4వ నిమిషంలో) ఏకైక గోల్ చేసి జట్టుకు టైటిల్ అందించాడు. ఆదిత్య థాపా కొట్టిన హెడర్‌ను బాక్స్‌కు సమీపంలో అందుకున్న రోబీ... సునాయాసంగా ప్రత్యర్థి పోస్ట్‌లోకి పంపాడు. ఆ తర్వాత స్కోరు సమం చేసేందుకు కేరళ జట్టు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గ్రూప్ దశలో అత్యుత్తమ ప్రదర్శనతో పరాజయం ఎరగకుండా ఫైనల్‌కు చేరిన ఇరుజట్ల మధ్య ఉత్కంఠ భరిత సమరం జరగగా... చివరకు పశ్చిమ బెంగాల్‌నే విజయం వరించింది.

**2025 స్పోర్ట్స్ క్యాలెండర్**

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

## సినిమా


ఎన్టీఆర్ | ప్రభాస్ | మహేశ్ బాబు

# విదేశాల్లో 2025

**2024కి బై చెప్పి... 2025కి వెల్‌కమ్ చెప్పడానికి అందరూ సెలబ్రేషన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. కొందరు స్టార్స్ అయితే కొత్త సంవత్సరం జరుపుకోవడానికి విదేశాలు వెళ్లారు. షూటింగ్స్‌కి కాస్త విరామం దొరకడంతో వెకేషన్ ప్లాన్ చేసుకునే అవకాశం ఈ స్టార్స్‌కి దక్కింది. వారి ఈ వెకేషన్ గురించి తెలుసుకుందాం...**

ఈ ఏడాది మహేశ్‌బాబు ఇప్పటికే రెండుసార్లు జర్మనీ వెళ్లొచ్చారు. అయితే ఇది హాలిడే ట్రిప్ కాదు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా ప్రిపరేషన్‌లో భాగంగా జర్మనీ వెళ్లారని చెప్పుకోవచ్చు. అయితే ప్రతి ఏడాది మహేశ్‌బాబు న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ఫారిన్‌లో జరుగుతుంటాయి. ఈ ఏడాది కూడా ఫారిన్‌లోనే మహేశ్‌బాబు ప్లాన్ చేశారని సమాచారం. మహేశ్‌బాబు మోస్ట్‌లీ యూరప్‌కు వెళ్లనున్నారట.

ఇక ప్రభాస్ ఆల్రెడీ యూరప్‌లో ఉన్నారని తెలిసింది. ఇటీవల ఓ సినిమా చిత్రీకరణలో భాగంగా ప్రభాస్ కాలికి గాయమైంది. వైద్యుల సూచనల మేరకు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. యూరప్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నారని, ప్రభాస్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అక్కడే అని టాక్. విదేశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత 'రాజా సాబ్, ఫౌజి' చిత్రీకరణలో పాల్గొంటారు ప్రభాస్. ఈ సినిమాల చిత్రీకరణలు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' చిత్రాన్ని ఆరంభిస్తారు ప్రభాస్. ఇక 'దేవర' సక్సెస్ జోష్‌లో ఉన్నారు ఎన్టీఆర్. ప్రస్తుతం ఎన్టీఆర్ హిందీలో స్ట్రయిట్ ఫిల్మ్ 'వార్ 2' (ఈ చిత్రంలో హృతిక్ రోషన్ మరో హీరో) లో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాకు చెందిన ఓ లెంగ్తీ షూట్‌ను పూర్తి చేశారు. ఆ తర్వాత ఫ్యామిలీతో కలిసి లండన్ వెళ్లారని తెలిసింది. సో... ఎన్టీఆర్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లండన్‌లోనే అని ఊహించవచ్చు. లండన్ నుంచి తిరిగొచ్చిన తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) షూటింగ్‌తో ఎన్టీఆర్ బిజీ అవుతారట. ఇంకా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం హీరోయిన్ పూజా హెగ్డే స్పెయిన్ వెళ్లారు. రష్మికా మందన్నా ఆల్రెడీ ఫారిన్‌లోనే ఉన్నారని తెలిసింది. హీరోయిన్ తమన్నా, ఫరియా అబ్దుల్లా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను అమెరికాలో ప్లాన్ చేశారని తెలిసింది. వీరితో పాటు మరి కొందరు టాలీవుడ్ యాక్టర్స్ గోవా, మాల్దీవ్స్‌లో వేడుకలు ప్లాన్ చేశారని సమాచారం.


కుటుంబ సభ్యులతో ఎన్టీఆర్


సరిత, నయనతార, విఘ్నేశ్, మాధవన్

**భర్త విఘ్నేష్ శివన్‌తో నయనతార దుబాయ్ వెళ్లారు. అక్కడే మాధవన్, ఆయన భార్య సరిత కూడా ఉన్నారు. సో... ఈ రెండు ఫ్యామిలీస్ ఒకే చోట వేడుక చేసుకోనున్నారు. కలిసి ఉన్న ఫొటోను కూడా షేర్ చేశారు. అలాగే బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కూడా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ స్పాట్‌గా దుబాయ్‌నే ఎంచుకున్నారు. ఇంకా ఫ్యామిలీతో కలిసి దియా మీర్జా శ్రీలంక వెళ్లారు. అర్జున్ రాంపాల్ సెలబ్రేషన్స్ గోవాలో జరుతాయని సమాచారం. ఫ్యామిలీతో కలిసి కరీనా కపూర్ స్విట్జర్లాండ్‌లో, శిల్పాశెట్టి లండన్‌లో, భర్త జహీర్ ఇక్బాల్‌తో కలిసి హీరోయిన్ సోనాక్షీ సిన్హా ఆస్ట్రేలియాలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ జరుపుకోనున్నారు. 'యానిమల్' ఫేమ్ త్రిప్తీ డిమ్రీ ఫిన్‌ల్యాండ్ వెళ్లారు.**

# ఓ వెన్నెల...

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ హీరోయిన్. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించారు. ఈ నెల 3న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'భైరవం' మూవీ నుంచి 'ఓ వెన్నెల..' అంటూ సాగే పాటని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న చిత్రం 'భైరవం'. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి'' అని చిత్రబృందం పేర్కొంది.


సాయి శ్రీనివాస్, అదితీ శంకర్

# 2024ని మంచి సినిమాతో ముగించాను

**- జాన్వీ కపూర్**



''అమరన్' సినిమాని కాస్త ఆలస్యంగా చూశాను. అయితే 2024 సంవత్సరాన్ని ఇలాంటి ఒక అద్భుతమైన, ఒక మంచి సినిమా చూసి ముగించినందుకు చాలా సంతోషంగా ఉంది'' అని హీరోయిన్ జాన్వీ కపూర్ అన్నారు. శివ కార్తికేయన్, సాయిపల్లవి జోడీగా నటించిన ద్విభాషా చిత్రం (తమిళ్, తెలుగు) 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. 2014లో జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. దీపావళి కానుకగా 2024 అక్టోబరు 31న విడుదలైంది. ఈ మూవీ తెలుగు, తమిళ భాషల్లో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. ఈ చిత్రంపై ఇప్పటికే ఎంతోమంది స్టార్స్ కూడా ప్రశంసలు కురిపించారు. తాజాగా జాన్వీ కపూర్ కూడా 'అమరన్' మూవీపై తన ఇన్‌స్ట్రాగామ్ ద్వారా ప్రశంసలు కురిపించారు. ''అమరన్' సినిమాని నేను చూడడం ఆలస్యమైంది. కానీ, ఎంతో అద్భుతమైన సినిమా. ప్రతి సన్నివేశం చాలా భావోద్వేగంతో నిండిపోయింది. ఈ ఏడాదికి 'అమరన్' బెస్ట్ మూవీ. ఈ చిత్రం నా హృదయాన్ని కదిలించింది. ఈ సినిమాలోని సన్నివేశాలు నా హృదయాన్ని బరువెక్కించాయి. ఓ ప్రేక్షకురాలిగా 2024ని ఇలాంటి ఒక మంచి సినిమాతో ముగించడం సంతోషంగా ఉంది'' అని పోస్ట్ చేశారామె. కాగా ఎన్టీఆర్ 'దేవర' మూవీతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ ప్రస్తుతం రామ్‌చరణ్‌కి జోడీగా నటిస్తున్నారు.

# గుండె జారిపోయిందే!

వరుణ్ రాజ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'పోకిరి'. వికాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమత హీరోయిన్. ప్రమోద్ రాజు సమర్పణలో రాజా మూవీస్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. కాగా వరుణ్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా 'పోకిరి' నుంచి 'గుండె జారిపోయిందే..'. అంటూ సాగే మొదటి పాటని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో-నిర్మాత వరుణ్ రాజ్ మాట్లాడుతూ– ''పోకిరి' టైటిల్‌లోనే దమ్ముంది. ఈ సినిమాతో హిట్ సాధిస్తామనే నమ్మకం ఉంది. 'పోకిరి' సినిమాకి ఓనర్ మహేశ్‌బాబుగారే. మేమంతా ఆయన అభిమానులం అంతే'' అన్నారు. ''ఈ మూవీ స్టోరీ లైన్ రాసుకున్నప్పటి నుంచి 'పోకిరి' అనే టైటిల్ అనుకున్నాం'' అని వికాస్ చెప్పారు. ''పోకిరి' నా తొలి సినిమా'' అని పేర్కొన్నారు మమత. సంగీత దర్శకుడు ఉదయ్ కిరణ్ మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకీ-వంశీ.


వరుణ్ రాజ్, మమత

## ఓటీటీ ఇది చూడొచ్చు

# సీక్రెట్స్ ఆఫ్ ఆర్ఆర్ఆర్ బై రాజమౌళి

**ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో ఆర్ఆర్ఆర్ - బిహైండ్ అండ్ బియాండ్ ఒకటి. ఈ డాక్యుమెంటరీ గురించి తెలుసుకుందాం.**




తన ఉనికిని తెలిపేందుకు ఓ గదిలో నలుగురు ముందు చప్పట్లు కొడితే ఆ నలుగురికి తన విషయం తెలియవచ్చు. కానీ అదే ఉనికి ప్రపంచానికి తెలియాలంటే సరిగ్గా రాజమౌళిలా ఆలోచించాలి. భారత దేశానికి ఒకప్పుడు సినిమా ప్రమోషన్‌ను ఓ వినూత్న పంథాలో పరిచయం చేసిన బాలీవుడ్ దిగ్గజం అమిర్ ఖాన్ కూడా తాను ఈ విషయంలో రాజమౌళినే ఫాలో అవుతాననడం దీనికి ఓ నిదర్శనం. చరిత్ర అనేది రాజమౌళి ముందు ఉన్నది తరువాత ఉంటుంది, కానీ ఆ చరిత్రలో రాజమౌళికి ఓ చెరగని పేజీ ఉంటుందనేది మాత్రం నిర్వివాదాంశం. తెలుగు సినిమా వైభవాన్ని ఎన్నో అంతర్జాతీయ వేదికలపైన నిలిపిన శిల్పి రాజమౌళి. మరీ ముఖ్యంగా తెలుగు సినిమాకి ఆస్కారమే లేదన్న ఆస్కార్ పురస్కారాన్ని అద్భుతంగా అందించిన అత్యున్నత దర్శకులు రాజమౌళి. తన సినిమా అంటేనే ఓ సంచలనం. మరి... ఆ సంచలనం వెనకున్న సీక్రెట్ తెలుసుకోవాలని ప్రతి దర్శకుడితో పాటు సామాన్య ప్రేక్షకుడికి కూడా ఆసక్తి ఉంటుంది. ఆ కోవలోనే రాజమౌళి తీసిన 'ఆర్ఆర్ఆర్' సినిమాకి సంబంధించిన తన కష్టాన్ని ఓ చక్కటి డాక్యుమెంటరీ రూపంలో 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్' పేరిట నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంచారు. దాదాపు రెండున్నర గంటల పై నిడివి ఉన్న 'ఆర్ఆర్ఆర్' సినిమాను నాలుగేళ్ల పాటు తీశారు. ఈ డాక్యుమెంటరీలో ఆ సినిమా మొత్తాన్ని ఎలా తీశారో రాజమౌళి వ్యాఖ్యానంతో పాటు సినిమాలోని నటీనటులు టెక్నీషియన్స్ కూడా వివరిస్తూ చూపించడం ఎంతో బాగుంది. తన ఈ 'ఆర్ఆర్ఆర్' ప్రయాణానికి సంబంధించి ఎన్నో తెలియని, చూడని అద్భుత విషయాలను ప్రేక్షకులకు అందంగా అందించారు. ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి... ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన ఫుటేజ్ కొన్ని గంటల రూపంలో ఉంటే దానిని ఎడిట్ చేసి, గంటన్నర నిడివితో అందించారట. ఈ సమాజమనేది ఓ సృష్టి. ప్రతిరోజూ మన మనుగడ ఈ సృష్టికి అనుగుణంగానే ఉంటుంది. ఓ రకంగా సినిమా అన్నది కూడా ఓ సృష్టి. ఓ దర్శకుడి ఆలోచనకు ప్రతిరూపమే సినిమా అన్న ఓ అద్భుత సృష్టి, కానీ ఈ సినిమా సృష్టిలో ఎంతోమంది కష్టం ఉంటుంది. మరి... అటువంటి సినిమాను ఏ విధంగా రూపొందించారో ఆ రహస్యాలు మీరు కూడా తెలుసుకోవాలంటే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్'ని చూసేయండి. వర్త్ టు వాచ్ అండ్ ప్రిజర్వ్ ద డాక్యుమెంటరీ ఫర్ ది ఫ్యూచర్ కిడ్స్.

**– ఇంటూరు హరికృష్ణ**

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.